

# కథా కౌముది

## పెంపకం నిరుపమ రావినూతల

రోజంతా స్కూల్లో పిల్లలతో వాగి, వాదించి సాయంసంధ్య చిరుచీకట్లు అలుముకుంటుండగా, ఇప్పుడే ఇంటికొచ్చి పడ్డాను. కాలిఫోర్నియాలో ఒక ప్రముఖ ప్రయివేట్ స్కూల్లో లెక్కల ట్యుటర్ గా పనిచేస్తున్నాను నేను. బాగా అలసటగా ఉంది. ఆకలి దంచేస్తోంది. కారు గరాజ్ లో పెట్టి, ఇంట్లోకి అడుగు పెట్టగానే, రవ్వ ఇడ్లిలు ఉడుకుతున్న పరిమళం చుట్టుముట్టింది. రవ్వ నేతిలో వేయించాడేమొ, కమ్మటి ఆ వాసనకే ఆకలి రెట్టింపయింది.

"ఇప్పుడే ఇడ్లి కుక్కర్ పెట్టాను, నువ్వెళ్ళి ఫ్రెష్ అయ్యిరా ,ఈ లోపు చట్నీ చేసేస్తాను" అన్నాడు నా భర్త రాఘవ.

ఆరేళ్ళ మా ముద్దుల కూతురు "అమేయ" తన చిట్టి చేతులతో మా వారికి సహాయం చేస్తోంది. వర్క్ ఫ్రం హోం కారణంగా రాఘవ ఇంట్లో ఉండటం చేత అప్పుడప్పుడు గరిటతిప్పటం తనకి మామూలే. టీవిలో వచ్చే రకరకాల వంటల ప్రయోగాలు కూతురికోసం చేస్తూ ఉంటాడు. అలాగే ఇవాళ ఈ వంట చేస్తున్నాడు. వంటింట్లో ఆ నాన్నా కూతుళ్ళని తనివితీర చూసి, నవ్వుతూ ఫ్రెష్ అవటానికి గదిలోకెళ్ళాను.

వంటింట్లో చూసిన ఆ దృశ్యం అప్రయత్నంగా, నాకు నా చిన్నతనాన్ని గుర్తుచేసింది. నా చిన్నప్పుడు మేము పల్నాడులో ఒక మారుమూల గ్రామం లో ఉండేవాళ్ళం. మా తాతయ్య అక్కడ సర్పంచ్ గా ఉండేవారు. అసలే ముక్కోపి, పైగా బాగా వెనుకబడిన ప్రాంతమేమో, చాల మొరటుగా ఉండేవారు. నానమ్మ ని ,ఇంకా తన పిల్లలని చిన్న పెద్దా చూడకుండా చిన్న చిన్న వాటికే చితకబాదేవాడు. కోపంలో , తొందరపాటులో ఆ దుర్వాసుడి అంశే. ఆడవారు వంటింట్లో తప్ప, బయట నోరెత్తినా, చెప్పిన వంట కాకుండా ఏ కొంచం మార్చినా, వెంటనే శివాలెత్తిపోయేవాడు. ఆ చుట్టుపక్కలంతా మగవారు దాదాపు ఇలాగే ఉండేవారు.

ఎదుగుతున్న పిల్లలం ఇలాంటి వాతవరణం లో పెరగటం ఇష్టంలేక, మా అమ్మ నాన్న, గుంటూరు నగరానికి బదిలి చేయించుకుని వచ్చేసారు. పెద్ద పట్టణం కావటంతో, గుంటూరులో మంచి వాతవరణమే

ఉండేది. ఇంటిపనులు, వంట, ఎక్కువగా అమ్మే చేసినా, ఇద్దరు ఉద్యోగస్తులవటం చేత , ఎప్పుడన్నా సరదాగా, అమ్మకి విశ్రాంతి ఇవ్వటం కోసం నాన్న గరిటపట్టేవారు. నాన్న ఎప్పుడన్నా ఒకసారి చేసే, పల్నాటి రుచులు, లొట్టలేసుకుంటూ తినటం ఇప్పటికి లీలగా గుర్తే నాకు. ఐనా కూడా ఏదో మూల మా నాన్నంటే కాస్త భయమే మాకు. చాలా వరకు మాతో సరదాగానే ఉన్నా, కోపంలో మాత్రం, మా తాతకి కొడుకే. సరదాగా ఉన్నారు కదా అని చిన్నప్పుడొకసారి స్వీట్లు కావాలని అడిగాను. డబ్బులేమన్న చెట్లకి కాస్తున్నాయనుకున్నావా అంటూ మండిపడిపోయారు.

పరీక్షల్లో నూటికి తొంభై ఎనిమిది మార్కులు వస్తే మెచ్చుకోకపోగా, “ఆ రెండు మార్కులు ఎందుకు పోయాయి? అంత అలక్ష్యంగా ఎందుకున్నావు? నీకన్నా ఎక్కువ మార్కులు ఇంకెవరికన్నా వచ్చాయా? ఎందుకు సరిగ్గా చదవలేద”ని గద్దించి గడగడలాడించేవారు. అన్ని మార్కులొచ్చి స్కూల్లో అందరితో సెభాష్ అనిపించికునే నేను, అ ప్రోగ్రెస్ రిపోర్ట్ లో నాన్నతో సంతకం పెట్టించుకురావటానికి ఇబ్బందిపడే నన్ను చూసి నా స్నేహితులు నన్ను వింతగా చూసేవారు.

అందుకే నాన్నంటే భయంతో కూడిన గౌరవమే తప్ప, చనువు లేదు నాకు. ఇప్పుడు రాఘవ నాకంటె చెయ్యితిరిగినవాడిలా వంటచేస్తూ, కూతురితో ముద్దులాడుతూ ఉంటే , ఇంతలోనే ఎంత మార్పు మగవాళ్ళలో అనిపించింది.

ఇన్స్టంట్ పాట్ సౌండ్ రావటంతో, ఇడ్లిలు తయారయ్యిఉంటాయని, సర్వ్ చేద్దామని మూత తీసి చూసి, ఆశ్చర్యంతో "ఏంటండి ఇది? " అని చిన్నపాటి గావుకేక పెట్టాను. తెల్లగా మిలమిలలాడాల్సిన ఇడ్లిలు, ముదురు నీలాకాశం రంగులో ఉన్నాయి మరి." ఓ అదా, అమేయ బ్లూ ఇడ్లి కావాలని అడిగింది. అందుకే చేసాను" తాపీగా చెప్పాడు రాఘవ.

"ఐనా ఇంట్లో ఫుడ్ కలర్స్ ఏమి లేవే! మరి ఈ రంగు ఎలా వచ్చింది?" విస్తుబోతూ అడిగాను.

"ఫుడ్ కలర్స్ ఆరోగ్యానికి మంచిది కాదు. నేనవి వాడలేదు. ఎప్పుడూ వాడను కూడా. ప్రకృతిసిద్ధంగానే ఈ రంగు రప్పించాను" కించిత్ గర్వంగా చెప్పాడు.

"అదే ఎలా?" సస్పెన్స్ తట్టుకోలేకపోతున్నాను నేను.

చిరునవ్వులు చిందిస్తూ మా పెరటి వైపు వేలు చూపించాడు.

మా పెరటి పెర్గోలా ( పెర్గోలా అంటే తీగ మొక్కలు పాకటానికి అనువుగా ఉండేందుకు ఎత్తుగా ఆర్చిలాగా ఉండే ఒక నిర్మాణం. అమెరికా పార్కుల్లో, ఇంటి పెరళ్ళలో ఇవి సర్వసాధారణంగా ఉంటాయి) మీదకి పాకిన నీలం రంగు శంకుపూల తీగని చూపించాడు.

ఈ తీగ అమేరికాలో అన్నిచోట్లా దొరకదు. లాస్ ఏంజలెస్ లో, ఏదో షాపులో ఉందని తెల్సినవాళ్ళు చెప్తే, రెండు గంటలు ప్రయాణించి ,ఆ మొక్కని తెచ్చి మా పెరట్లో నాటి పెర్గోలా మీదకి పాకించాడు. చాలా

త్వరగా అల్లుకుని, బాగా పూలు పూసింది. ఆ పూలని తెచ్చి వాటిమీద వేనీళ్ళు పోసి కాసేపు నానబెడితే, వాటి నీలంరంగంతా నీటిలోకి వస్తుందని, ఆ నీళ్ళు చాలా ఔషధగుణాలు కలిగి ఉంటాయని చదివాడట. ఇప్పుడు ఆ నీళ్ళే వాడి ఈ రవ్వఇడ్లిలు తయరుచేసాడు.

ఇంతలోనే మరో సందేహం నాకు. "ఆ పెర్గోలా చాల ఎత్తుగా ఉంది కదా? పూలు ఎలా కోశారు ?" అని అడిగాను.

"పక్కింటికి వెళ్ళి వాళ్ళ నిచ్చెన అడిగి తెచ్చి కోశాను" చాలా తేలిగ్గా చెప్పేసాడు. నా మనస్సు ఒక్క క్షణం చివుక్కుమంది. తను రోజంతా ఆఫీస్ పనితో, వరుస మీటింగ్ లతో ఎంతో బిజిగా ఉంటాడని తెలుసు నాకు. అంత పనిలో ఉండి కూడా, పక్కింటి నుంచి అంత బరువైన నిచ్చెన తెచ్చి, ఇంత శ్రమపడి ఇదంతా చెయ్యాలా? ఇడ్లిలు నీలంగా ఉండవమ్మా, తెల్లగానే ఉంటాయని అమేయకి సర్దిచేప్తే సరిపోయేదిగా ? ఇంత ప్రయాస పడటం అవసరమా అని బాధనిపించింది. ఆ మాటే రాఘవ తో అన్నాను.

రాఘవ ఎప్పటిలాగే చిద్విలాసంగా నవ్వుతూ "నాన్నా ,నాకు బ్లూ ఇడ్లి కావాలి అని అమేయ అన్నప్పుడు, ఒక్క క్షణం నాకూ నీలాగే తనకి సర్దిచేప్తే సరిపోతుంది కదా అని అనిపించింది. అంతలోనే, మనమే తన ఊహాశక్తికి ఎందుకు కళ్ళెం వెయ్యలి? ఇడ్లిలు అంటే ఎప్పుడూ తెల్లగానే ఉండాలా? ఆరోగ్యం విషయంలో రాజి పడకుండా తనడిగిన రంగులో ఎలా చెయొచ్చో అని అలోచించి చేసాను. రేపు తను, మనం పెద్దయ్యాక గుర్తుచేసుకుంటే, ఇలాంటివే కదా మధుర జ్ఞాపకాలుగా మిగిలేది. తనకిలాంటి జ్ఞాపకాలని అందించటం ముందు ఇదేమంత కష్టం అనిపించలేదు. ఇలాంటివే కదా తనకి మనమిచ్చే విలువైన ఆస్తి" అన్నాడు.

" ఐనా మీ పిచ్చి కాకపోతే, తను పెరిగి పెద్దయ్యాక, తనకి ఇవన్ని గుర్తుంటాయనుకుంటున్నావా?" రాఘవ ని కాస్త ఉడికిద్దామని అన్నాను.

"అమేయ కి ఇవన్ని గుర్తుండొచ్చు, ఉండకపోవచ్చు. కాని, ఇడ్లిలు తెల్లగా మాత్రమే ఉంటాయని నేనే తన ఆలోచనా పరిధిని కుదించేస్తే, ముందుముందు తను కొత్త ఆలోచనలు చేయటానికి సంకోచించొచ్చు. ఎదిగే వయస్సులో, నాన్నని ఏదన్నా విషయం అడగొచ్చో లేదో, ఏమనుకుంటారో అన్న అనుమానంతో కాకుండా, నాన్నని ఏదైనా అడగొచ్చన్న భరోసాతో పెంచాలనుకుంటున్నా. అందుకే ఇలాంటివన్ని. తనని చూడు, ఆల్రెడి "నాన్న బ్లూ ఇడ్లి చేసాడు. మై నాన్న ఈజ్ ద బెస్ట్ నాన్న ఇన్ ద వరల్డ్ " అని ఎలా గంతులేస్తుందో. తన కళ్ళలో ఇలాంటి మెరుపు కోసం ఎంత కష్టమైనా నాకు ఇష్టమే" అన్నాడు.

"అయినా అడక్క అడక్క నీలం రంగు ఇడ్లిలే అడగాలా నీ ముద్దుల కూతురు ? ఎక్కడో చదివాను, ప్రపంచంలో ఎక్కువ శాతం మంది నీలం రంగు ఆహారపదార్థాలను తినటానికి ఇష్టపడరట " రాఘవ ని ఆటపట్టించాలని అన్నాను.

" ప్రపంచమంతా ఏకమై కుదరదన్నా కూడా, నా చిట్టి తల్లి అడిగింది కాబట్టి, అది నేను చెయ్యాల్సిందే. నువ్వు రారా బంగారుతల్లి, ఈ అమ్మ ఇలాగే కబుర్లతో కడుపు నింపేస్తుంది. మనం మన బ్లూ ఇడ్లి తిందాం" అంటూ అమేయని ఎత్తుకుని వెళ్ళిపోయాడు.

తండ్రి అంటే భయం, భక్తి మాత్రమే ఉండాలనుకునే తాతలకాలం నుండి, తండ్రి అంటే ఒక నమ్మకం, భరోసా అనుకునేలా పిల్లలని పెంచాలనుకుంటున్న నేటి తరం ఆధునిక తండ్రుల్లో వస్తున్న మంచి మార్పుని మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ, నేను కూడా నీలం ఇడ్లిలు తినటానికి ఉపక్రమించాను.

COMMENTS